క్లుప్తంగా

కంటి ఆపరేషన్లకు 25మంది ఎంపిక


కంటి వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

బంగారుపాళెం: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సోమవారం మిషన్ ఫర్ విజన్ ట్రస్ట్, చెన్నై శంకర్ నేత్రాలయ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 55 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో 25 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించినట్లు నిర్వాహకుడు మురళీకృష్ణ తెలిపారు. ఎంపికైన వారిని చెన్నైకి తరలించి ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహించి, మందులు, కళ్లద్దాలు పంపిణీ చేయనున్నట్లు తెలియజేశారు.

కాణిపాక ఆలయ పవిత్రతను కాపాడండి

- మాజీమంత్రి గల్లా అరుణకుమారి



కాణిపాకం: కాణిపాక ఆలయ పరిసర ప్రాంతాల్లో ఉన్న రాజకీయ పార్టీ నాయకులు, ప్రకటనలకు సంబంధించిన బ్యానర్లను తొలగించి.. ఆలయ పవిత్రతను కాపాడాలని మాజీ మంత్రి గల్లా అరుణకుమారి ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. వరసిద్ధుని దర్శనార్థం దేశ విదేశాల నుంచి భక్తులు వస్తుంటారని, అలాంటి పుణ్యక్షేత్రంలో భక్తి భావం పెంపొందించేలా ఆలయ పరిసరాలను తీర్చిదిద్దాలన్నారు. ఆలయం నుంచి అగరంపల్లె ఆర్చి వరకు, ఐరాల క్రాస్ ఆర్చి వద్ద వివిధ రాజకీయ నాయకుల బ్యానర్లు, వ్యాపార ప్రకటనలతో నిండిపోయిందన్నారు. దీనిపై అధికారులు, పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం శోచనీయమన్నారు. తాను మంత్రి, ఎమ్మెల్యేగా పనిచేసే సమయంలో ఇలాంటి వాటిని ఉంచరాదని తీర్మానం చేశామని గుర్తుచేశారు. ఇకపై కూడా ఈ విధానాన్ని కొనసాగించి భక్తులకు ఇబ్బంది లేకుండా జిల్లా కలెక్టర్ చూడాలని కోరారు.

వళ్లీ దేవసేనుని సేవలో జిల్లా ఎస్పీ దంపతులు


ఎస్పీ దంపతులకు ప్రసాదాలిస్తున్న దృశ్యం

రామకుప్పం: మండల కేంద్రానికి సమీపంలోని శ్రీసుబ్రమణ్యస్వామి వారోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభయ్యాయి. సోమవారోత్సవాల్లో జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు దంపతులు వళ్లీ దేవసేనుని దర్శించుకున్నారు. వారికి ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు స్వాగతం పలికి దర్శనం ఏర్పాట్లు చేశారు. అనంతరం ఎస్పీ దంపతులకు స్వామివారి వస్త్రంతోపాటు ప్రసాదాలను అందజేశారు.

బై..బై.. గణేశా..!

- అంగరంగవైభంగా ఊరేగింపు
- కోలాహలంగా నిమజ్జనం


కట్టమంచి చెరువులో చేస్తున్న నిమజ్జనం


క్రేన్‌లో వినాయకుని ప్రతిమను అమరుస్తున్న దృశ్యం

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరంలో సోమవారం చవితి నిమజ్జన వేడుకలను యువత కేరింతల నడుమ కోలాహలంగా సాగింది. చవితిని పురస్కరించుకుని పలు ప్రాంతాల్లో శనివారం వినాయకుడిని కొలువుదీర్చారు. మూడు రోజుల పాటు భక్తుల చేత పూజలు అందుకున్న అనంతరం నిమజ్జనం చేయడం పరిపాటి. ఈ నేపథ్యంలో ఉదయం నుంచి రాత్రి వరకు కూడా అన్ని ప్రాంతాల్లో డప్పు వాయిద్యాల నడుమ స్వామివారు వాడవాడలా ఊరేగారు. ఇంటింటా పూజలు అందుకున్నారు. ఊరేగింపుగా వస్తున్న స్వామి వారికి భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు, పసుపు పళ్లెం పట్టి మొక్కులు చెల్లించారు. డప్పు వాయిద్యాల హోరు నడుమ యువకులు, చిన్నారులు, పెద్దలు చిందులేస్తూ ఉత్సాహంగా నిమజ్జన కార్యక్రమాన్ని పూర్తి చేశారు.

కట్టమంచి చెరువులో ..

కట్టమంచి చెరువు వద్ద నిమజ్జన ప్రక్రియ ప్రశాంతంగా సాగింది. నగరపాలక సంస్థ అధికారులు చెరువు వద్ద ముందస్తు ఏర్పాట్లు చేశారు. భారీ విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు క్రేన్‌ను అందుబాటులో ఉంచారు. నిమజ్జనం చేసేందుకు వచ్చిన నిర్వాహకులు, ప్రజలు అక్కడ స్వామి వారికి చివరి పూజలు చేసి బై..బై గణేశా అంటూ నిమజ్జన తంతు ముగించారు. ఇక, ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగించేలా బృందాన్ని ఏర్పాటు చేశారు. రద్దీని కట్టడి చేసేందుకు, కూడలిలో ట్రాఫిక్ అంతరాయం కలగకుండా ట్రాఫిక్ పోలీసులు పటిష్ట చర్యలు తీసుకున్నారు.

బంగారుపాళెంలో...

బంగారుపాళెం: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం సాయంత్రం వినాయకుని నిమజ్జనోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. గ్రామాల్లో వినాయక ప్రతిమలకు మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఉట్లోత్సవం నిర్వహించారు. పెద్దసంఖ్యలో యువకులు ఉట్టి కొట్టేందుకు ఉత్సాహం చూపారు. అనంతరం వినాయకుని విగ్రహాలను మేళతాళాలు, బాణసంచా వేడుకలు నడుమ యువకులు తరలించి నిమజ్జనం చేశారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.




బంగారుపాళెం: వినాయకుని విగ్రహాన్ని నిమజ్జనానికి తరలిస్తున్న యువకులు, మట్టి వినాయకుడిని నిమజ్జనానికి తీసుకొస్తున్న బాలిక ఊరేగింపుగా వెళుతున్న వినాయకుడు


కట్టమంచిలో క్రేన్‌తో చేస్తున్న నిమజ్జనం



కట్టమంచి చెరువు వద్ద చివరి పూజలు చేస్తున్న భక్తులు

ఆస్పత్రి కిటకిట


విభాగం వద్ద క్యూకట్టిన ప్రజలు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో సోమవారం ఓపీ రద్దీ నెలకొంది. సాధారణ జబ్బులు, జ్వరంతో పలు ఓపీ విభాగాలు జనంతో క్యూకట్టాయి. ప్రధానంగా మహిళా విభాగాలు కిటకిటలాడాయి. ఉదయం 12 గంటలకు వరకు కూడా ఆ విభాగం వద్ద రద్దీగానే కనిపించారు. మిగిలిన విభాగాలు సాధారణంగానే కనిపించాయి. దీంతో పాటు ల్యాబ్ విభాగంలో క్యూ కనిపించింది.

సబ్‌స్టేషన్ పరిశీలన


సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఈఈ మునిచంద్ర

చిత్తూరు కార్పొరేషన్: స్థానిక సంతపేట సెక్షన్ సబ్‌స్టేషన్‌ను సోమవారం ట్రాన్స్‌కో ఈఈ మునిచంద్ర పరిశీలించారు. సెక్షన్ పరిధిలో సర్వీసుల సంఖ్య, మొత్తం రెవెన్యూ వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ట్రిప్పింగ్ సమస్యల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యల గురించి మాట్లాడారు.

ఎస్టీల భూములను ఆక్రమించుకోవడం దారుణం

బంగారుపాళెం: మొగిలి గ్రామానికి చెందిన యానాదుల భూములను అగ్రవర్ణానికి చెందిన వ్యక్తి దౌర్జన్యం చేసి ఆక్రమించుకోవడం దారుణమని సీపీఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు సోమవారం ఓ ప్రకటనలో ఖండించారు. సర్వే నంబర్ 61లోని ఊరగుట్ట భూమిని యానాదులు తరతరాలుగా సాగు చేసుకుంటున్నారన్నారు. అక్కడే శ్మశానాన్ని కూడా ఏర్పాటు చేసుకున్నారన్నారు. మొగిలికి చెందిన ఏకాంబరంనాయుడు ఎస్టీల భూములను ఆక్రమించి, బోరు, కరెంటు, పైప్‌లైను పనులు చేపట్టాడన్నారు. దీనిని ప్రశ్నించిన ఎస్టీలపై దౌర్జన్యం చేయడమే కాకుండా కులం పేరుతో వారిని దూషించాడని, అతడితోపాటు అతనికి సహకరిస్తున్న రెవెన్యూ అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో యానాదుల పక్షాన ఆందోళన చేస్తామన్నారు.

బాబు వైఖరి వల్లే వరద విలయం

- తప్పులను కప్పిపుచ్చుకునేందుకు చంద్రబాబు ప్రయత్నం
- 'సాక్షి'తో పూతలపట్టు మాజీ ఎమ్మెల్యే సునీల్‌కుమార్



కాణిపాకం: విజయవాడలో వరదల విలయానికి ముమ్మాటికీ చంద్రబాబునాయుడు కారణమని, తన ఇల్లు వరద నీటిలో మునగకుండా చేసేందుకు తీసుకున్న చర్యల వల్ల విజయవాడ ప్రజలు వరదల విలయానికి బలిపశువులు అయ్యారని పూతలపట్టు మాజీ ఎమ్మెల్యే సునీల్‌కుమార్ ధ్వజమెత్తారు. విజయవాడ వరద విపత్తుపై ఆయన సోమవారం 'సాక్షి'తో మాట్లాడారు. భారీ వర్షాలు వస్తాయని, వరద ముప్పు పొంచి ఉందని వాతావరణశాఖ నాలుగైదు రోజుల ముందే ప్రభుత్వాన్ని హెచ్చరించినా పెడచెవిన పెట్టిందని దుయ్యబట్టారు. తన ఇంటిని కాపాడుకునేందుకు ప్రాధాన్యత ఇచ్చిన సీఎం విజయవాడ ప్రజలను మాత్రం వరద నీటికి వదిలేశారని మండిపడ్డారు. ప్రభుత్వం వల్ల తప్పిదం జరిగితే..బుడమేరు వల్లే జరిగిందని కుంటిసాకులు చెబుతున్నారని, అంతేకాకుండా వరద బాధితులను ఆదుకోవడంలో పూర్తిగా విఫలమైందన్నారు. నీట మునిగిన ఇళ్లలోని వ్యక్తులను ప్రభుత్వం సురక్షిత ప్రాంతాలకు తరలించే ప్రయత్నం చేయకపోవడంతో సర్వస్వం కోల్పోయి కుటుంబాలు నరకయాతన అనుభవిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా స్పందించి పూర్తి స్థాయిలో బాధిత కుటుంబాలకు అన్ని విధాలా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఇక పూతలపట్టు నియోజకవర్గంలో కూడా చెరువు కట్టలు, కాలువలను భద్రం చేసి ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

విఘ్నేశ్వరుడిని దర్శించుకున్న విజయానందరెడ్డి


విఘ్నేశ్వరుడికి కర్పూర హారతి ఇస్తున్న విజయానందరెడ్డి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చవితిని పురస్కరించుకుని చిత్తూరు నగరం డీఐరోడ్డులో కొలువుదీరిన విఘ్నేశ్వరుడిని సోమవారం రాత్రి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చిత్తూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ విజయానందరెడ్డి దర్శించుకున్నారు.నిర్వాహకులు కన్నన్, దీపక్ ఆయన స్వాగతం పలికారు. ఆయన స్వామివారికి కర్పూర నీరాజనాలు సమర్పించారు. చిత్తూరును చల్లగా కాపాడాలని..సమృద్ధి వర్షాలు కురిపించాలని మొక్కారు. అనంతరం ఆయనకు నిర్వాహకులు స్వామి ప్రసాదం, పండ్లు అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం

బైరెడ్డిపల్లె: గర్భం దాల్చిన మహిళలు లింగ నిర్ధారణ పరీక్షలు చేసుకోవడం చట్టరీత్యా నేరమని సీడీపీఓ మాధవీలత అన్నారు. కమ్మనపల్లె సచివాలయ పరిధిలోని గ్రామాల్లో సోమవారం పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, గర్భవతులు పోషక విలువలతో కూడిన తాజా కూరగాయలు బాగా తినాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సూపర్‌వైజర్ సుజాత, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

నాలుగు గ్రామాల్లో 'ఫ్యామిలీ డాక్టర్'



వృద్ధుడికి బీపీ పరీక్ష చేస్తున్న డాక్టర్ కేశవ నారాయణ, గుడిపాల: రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ అనూష

తవణంపల్లె: మండలంలోని గోవిందరెడ్డిపల్లె, టీ.పుత్తూరు. పల్లెచెరువు, పైమాఘం గ్రామాల్లో సోమవారం స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారులు మోహన్‌వేలు, కేశవ నారాయణ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడారు. గ్రామాల్లో నివాస పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శ్రీహరి, సుబ్రమణ్యంరెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

197 రామాపురంలో..

గుడిపాల: మండలంలోని 197రామాపురంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. బొమ్మసముద్రం వైద్యాధికారి అనూష రోగులను పరీక్షించి మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది సరస్వతి, దివ్య, శశి, అశ్విని పాల్గొన్నారు.

ఆరోగ్య సూత్రాలు పాటించాలి

ఐరాల: గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఆరోగ్య సూత్రాలు పాటించాలనిని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ కోరారు. మండలంలోని పాలకలరెడ్డివారిపల్లెలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో వైద్యాధికారి గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం ఇళ్లకే పరిమితమైన రోగుల వద్దకు వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితి తెలుసుకుని సలహాలు-సూచనలు ఇచ్చారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు కూడా వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

ఐరాల: గర్భిణులు రక్తహీనత బారిన పడకుండా పౌష్టికాహారాన్ని తీసుకోవాలని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత అన్నారు. ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా డాక్టర్ గర్భిణులకు సోమవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గర్భిణులకు హిమోగ్లోబిన్ పరీక్షలు, బీపీ, షుగర్ పరీక్షలు ప్రతి నెలా ఆస్పత్రిలో చేస్తామన్నారు. గర్భిణులు క్రమం తప్పకుండా ఈ పరీక్షలు చేయించుకోవాలని కోరారు. గుడ్లు, పండ్ల రసం, నీరు ఎక్కువగా తీసుకోవాలన్నారు. ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాలు సురక్షితమన్నారు. బిడ్డ పుట్టిన వెంటనే ముర్రు పాలు పట్టించాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్


గర్భిణికి వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ పూర్ణలత

ఉలవ సాగుకు తరుణమిదే..!

పలమనేరు: పంటసాగుకు పెట్టుబడులు లేక, విత్తనాలున్నా అదును లేక ఖరీఫ్‌లో వేరుశనగ సాగు చేయలేని రైతులకు ఉలవ సాగు ప్రత్యామ్నాయంగా మారింది. వ్యవసాయశాఖ అధికారులు ఉలవలను 80 శాతం సబ్సిడీతో పలమనేరు వ్యవసాయశాఖ డివిజన్‌లో రైతులకు పంపిణీ చేస్తోంది. ఖరీఫ్ సీజన్‌లో మొదటి పంట తర్వాత వర్షాధారంగా లేదా ఏవైనా పంటలు వేయడానికి అనువుగా లేనప్పుడు ఉలవ సాగు రైతులకెంతో మేలు. ఖరీఫ్‌లో వేరుశనగ, నువ్వులు, గోగు తర్వాత ఏక పంటగానూ రాగి, జొన్న పంటల్లో సహ పంటగానూ ఉలవలు సాగుచేయవచ్చు. పంట వడుపుకున్నాక పశువులకు మంచి ఎండుమేతగా ఉపయోగపడుతుంది. ఇందుకు సంబంధించిన వివరాలను పలమనేరు వ్యవసాయశాఖ సహాయసంచాలకులు అన్నపూర్ణదేవి రైతులకు తెలియజేశారు.

పంట సాగు ఇలా.....

- సెప్టెంబర్ మొదటి వారం నుంచి ఉలవలు సాగు చేయవచ్చు
- ఎర్ర, నల్ల రేగడి నేలలు పంట సాగుకు అనుకూలంగా ఉంటాయి
- మురుగునీరు నిల్వ ఉండే నేలలు సాగు పనికి రావు
- ఉలవ పంటకాలం మాత్రం 85 నుంచి వంద రోజులు మాత్రమే
- దిగుబడి ఎకరాకు ఆరు నుంచి ఏడు క్వింటాళ్ల వరకు రావచ్చు
- విత్తనాలను చల్లే ముందు కిలో విత్తనానికి ఒక గ్రాము కార్బండజిమ్‌ను కలిపి విత్తనశుద్ధి చేయాలి.
- భూమిలో తగిన తేమను చూసి నాగలితో ఒకసారి, గొర్రుతో రెండుసార్లు మెత్తగా దున్ని దుక్కిని తయారు చేయాలి.
- విత్తనాలను చల్లేలా అయితే ఎకరాకు 12-15 కిలోల విత్తనాలు అవసరముంటుంది
- ఎకరాకు నాలుగు కిలోల నత్రజని, పది కిలోల భాస్వరం, ఎనిమిది కిలోల పొటాష్‌నిచ్చే ఎరువులను విత్తే ముందు వేసుకోవాలి
- అంతర కృషిగా నాటిన నెల లోపు కలుపు నివారణ చర్యలు తీసుకోవాలి



తెగుళ్ల నివారణ, సస్యరక్షణ చర్యలు

- పూతం పిందె దశలో కాయతొలుచు పురుగు ఆశించవచ్చు
- దీని నివారణకు లీటరు నీటికి ఎండో సల్ఫాన్ రెండు మిల్లీలీటర్లు కలిపి పిచికారీ చేయాలి
- వాతావరణంలో తేమశాతం ఎక్కువగా ఉన్నప్పుడు, రాత్రి, పగలు ఉష్ణోగ్రతల్లో వ్యత్యాసం ఎక్కువగా ఉంటే బూడిద తెగులు సోకవచ్చు.
- దీని నివారణకు లీటరు నీటికి ఒక గ్రాము కార్బండజమ్‌ను కలిపి పిచికారీ చేయాలి
- ఉలవ సాగుకు సంబంధించిన మరిన్ని వివరాల కోసం స్థానిక వ్యవసాయశాఖ అధికారులను సంప్రదించవచ్చు.

బ్రహ్మోత్సవం.. నృత్య శోభితం..!



కాణిపాకం: బ్రహ్మోత్సవాల్లో భాగంగా కాణిపాకంలోని శ్రీవరసిద్ధివినాయకస్వామి క్షేత్రంలో సోమవారం ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. పలువురు చిన్నారులు, యువతీయువకులు భరతనాట్యం, కూచిపూడి, లంబాడీ నృత్యాలతో మంత్రముగ్ధుల్ని చేశారు. కళాకారులను ఆలయ అధికారులు అభినందిస్తూ..ప్రశంసాపత్రాలు అందజేసి సన్మానించారు.




నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు

